క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెందుర్తి : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ తరఫున పలు ఉపాధ్యాయ, ప్రైవేటు పాఠశాలల సంఘాలు శుక్రవారం పెందుర్తి మండలంలో విస్తృత ప్రచారం చేశాయి. సరిపల్లి, గుర్రంపాలెం, రాంపురం, జుత్తాడ, శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేసి రఘువర్మను గెలిపించాలని కోరారు. ఏపీటీఎఫ్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం


అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువు దీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

నర్సింగ్ విద్యార్థినులకు మెరుగైన వైద్యం


బాధిత నర్సింగ్ విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి : ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వైద్యులకు సూచించారు. చికిత్స పొందుతున్న పెందుర్తిలోని ఇందిర స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులను ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించారు. గోపాలపట్నంలో బెహరా ఆస్పత్రిలో, పెందుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బాధితుల తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి


సీతమ్మధార యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామని యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సీతమ్మధార బ్రాంచి వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంకుల బ్రాంచిలలో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులలో వర్క్ మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మహీంద్ర, ఆదారి శ్రీను, రమేష్, ఈశ్వర్, శ్రీనివాస్, అనిల్, సుజాత, ప్రత్యూష పాల్గొన్నారు.

పేద రోగుల సేవల్లోనే ఆత్మ సంతృప్తి

మహారాణిపేట: పేద రోగులకు వైద్యం అందించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ సెమినార్ హాల్లో జరిగిన పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) విద్యార్థులు, ఇతర వైద్య విద్యార్థుల కోసం పరివర్తనాత్మక, ప్రేరణాత్మక ప్రసంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోగుల సంరక్షణ, వైద్య విధానం గురించి లోతైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. వారు ఎన్నో వ్యయ ప్రయాశలకు లోనై ఆస్పత్రికి వస్తారని, అలాంటి వారికి వైద్యం అందించడం సేవతో సమానం అన్నారు. బ్రహ్మకుమారీస్ సమాజ్ నుంచి బి.కె. మాధురి, కేజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రాధ రోగుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వైద్యసేవలు గగనం






సింహాద్రి ఎన్టీపీసీ ముఖచిత్రం


జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ ముఖచిత్రం


రాంకీ ఫార్మాసిటీ లోగో

పరవాడ:

పారిశ్రామిక హబ్‌గా దినదినాభివృద్ధి చెందుతున్న అనకాపల్లి జిల్లా పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నెలకొల్పాలని కార్మికులు కోరుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల కార్మిక వర్గాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

వేలాది మంది కార్మికులున్నా వైద్య సౌకర్యం గగనమే..

పరవాడలో వేలాది మంది పని చేస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, ఇండస్ట్రియల్ పార్క్ వంటి పరిశ్రమలు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నాయి. తాడి, ఏదురవానిపాలెం, లేమర్తి, ఈ.బోనంగి గ్రామాలకు చెందిన రైతుల నుంచి 2700 ఎకరాల పంట భూములను సేకరించి 2004లో జేఎన్ ఫార్మాసిటీ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం 1997లో వాడచీపురుపల్లి, కలపాక, స్వయంభూవరం, వెన్నెలపాలెం, సోమునాయుడుపాలెం, రావాడ ప్రాంత రైతుల నుంచి 3200 ఎకరాల పంట భూములను సేకరించి సింహాద్రి నేషనల్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ.బోనంగి, బొద్దపువానిపాలెం గ్రామాలకు చెందిన రైతుల నుంచి సుమారు 150 ఎకరాల పంట భూములను సేకరించి ఇండస్ట్రియల్ పార్క్‌ను 2004లో ఏర్పాటు చేశారు. కాగా ఫార్మాసిటీలోని 95 పరిశ్రమల్లో పని చేస్తున్న 19 వేల మంది కార్మికులు, సింహాద్రి ఎన్టీపీసీలో పని చేస్తున్న 1600 మంది కార్మికులు ఈఎస్‌ఐ చెల్లిస్తున్నారు. పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో గాయపడుతున్న కార్మికులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఆస్పత్రులు అందుబాటులో లేక విశాఖ, అనకాపల్లి పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడుతున్నారు.

అంబులెన్స్ కూడా లేదు..

అత్యవసర సమయాల్లో క్షతగాత్రులను తరలించేందుకు సరైన అంబులెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో లేక కార్మికులు వ్యయ ప్రయాసలకు గురవుతూ కొన్నిసార్లు మృత్యువాత కూడా పడుతున్నారు. స్థానికంగా ఈఎస్‌ఐ ఆస్పత్రి లేక కార్మికులే కాకుండా వారి కుటుంబాలు కూడా వైద్య సేవలు పొందలేకపోతున్నాయి. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే సొంత డబ్బులు చెల్లిస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కార్మిక వర్గాలు గత కొన్నేళ్ల నుంచి గగ్గోలు పెడుతున్నాయి. ఐదేళ్ల క్రితం పరవాడలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఈఎస్‌ఐ అధికారులు డిస్పెన్సరీ ఏర్పాటు చేసినప్పటికీ దానిని ఏనాడూ తెరిచిన పాపాన పోలేదు. ఊరకే అద్దె చెల్లిస్తూ కాలం గడిపారని, ఇటీవల దాన్ని కూడా పూర్తిగా ఎత్తివేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వం స్థలం కేటాయించని కారణంగానే ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయలేకపోతున్నామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి



పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే అత్యవసర వైద్యం పొందడానికి సరైన ఆస్పత్రి సౌకర్యం లేదు. పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే లోపు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు వస్తే సొంత డబ్బు చెల్లించి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడం ద్వారా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. – పీపీ నాయుడు, ఎన్టీపీసీ కార్మికుడు

ఐఆర్ కార్డులు వృథా



కార్మికులకు ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వైద్యం పొందడానికి అవసరమైన ఐఆర్ కార్డులున్నా ప్రయోజనం కనిపించడం లేదు. స్థానికంగా ఈఎస్‌ఐ ఆస్పత్రి లేకపోవడం వల్ల ఐఆర్ కార్డులు వృథా అవుతున్నాయి. ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతున్నా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి. – టి.మల్లేశ్వరరావు, ఫార్మాసిటీ కార్మికుడు

పోరాటం తప్పదు



పారిశ్రామికవాడలోని కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేసినా కనీస స్పందన లేదు. కార్మికుల చిరకాల కోర్కె తీర్చాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. – గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు

టమాటా రైతులు రైతుబజార్‌లో అమ్ముకోవచ్చు


రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి అరుణకుమారి

పెందుర్తి : టమాటా పండించిన రైతులు గిట్టుబాటు ధర రాకపోతే ఆయా పంటను నేరుగా రైతుబజార్‌లో అమ్ముకోవచ్చని పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి అరుణకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక రైతుబజార్‌లో టమాటా ధరలు, అమ్మకాలపై రైతులకు అవగాహన కలిగించారు. గ్రామాల్లో పండించిన రైతులు రైతు బజార్ కార్డు లేకపోయినా నేరుగా పంటను ఇక్కడకు తీసుకొచ్చి అమ్ముకోవచ్చని సూచించారు. ఈవో పద్మావతి శర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి మీడియా సహకారం అవసరం



మాట్లాడుతున్న సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సమీర్‌శర్మ

పరవాడ: సమాజానికి మీడియా సహకారం ఎంతైనా అవసరమని సింహాద్రి ఎన్టీపీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ సమీర్ శర్మ అన్నారు. స్థానిక ఎకోనో హోటల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింహాద్రి ఎన్టీపీసీ అమలు చేస్తున్న కార్యక్రమాలను సమాజానికి అందించడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందని ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది సంస్థ సాధించిన ముఖ్యమైన మైలురాళ్లను వివరించారు. హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, ఎన్విరాన్‌మెంటల్ ఏజీఎం వేలాయుధన్ పిళ్లయి జయన్, సీఎస్సార్ విభాగం సీనియర్ అధికారి ప్రకాశరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల నిర్వాహకులను అరెస్ట్ చేయాలి


పెందుర్తిలోని ఇందిర నర్సింగ్ కళాశాలలో పరిశీలిస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్ ప్రతినిధులు

పెందుర్తి : నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత అధ్వాన పరిసరాల్లో కళాశాల, హాస్టల్ నడుపుతూ విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పెందుర్తిలోని ఇందిర స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల నిర్వాహకులను తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఐ, ఏఐవైఎఫ్ ప్రతినిధులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాలను, హాస్టల్‌ను సందర్శించి అక్కడి పరిస్థితిపై మండిపడ్డారు. పరిసరాలు అత్యంత అధ్వానంగా ఉండడాన్ని ఆక్షేపించారు. ఇలాంటి స్థితిలో కళాశాల, హాస్టల్‌ను నడపడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తూ గిరిజన ప్రాంత యువతుల ప్రాణాలతో వీరు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వసతులు లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు, హాస్టళ్లు అనేకం ఉన్నాయని... అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ ఘటనపై విద్యార్థినులకు తగిన న్యాయం చేయకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సంఘం ప్రతినిధులు అసిరినాయుడు, అరుణ, అన్నపూర్ణ, రజని, రామలక్ష్మి, సూర్యనారాయణ, మణి, నరసింహ, సుధాకర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.
అదేవిధంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి, విశేషంగా హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి

పరవాడ: రానున్న వేసవిలో మండల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గొట్టపు బావులు, రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పని చేసేలా చూడాలన్నారు. మరమ్మతులకు గురైన మంచినీటి పథకాలకు తక్షణమే రిపేర్లు చేసి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.
మండలంలో అమలు జరుగుతున్న రహదారులు, డ్రైనేజీ అభివృద్ధి పనులను చకచకా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి.ధర్మారావు, తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, మండల వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం

మర్రిపాలెం : ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఊర్వశి వద్ద ఉన్న నవర ఐటీఐ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరాలు ఎలా జరుగుతున్నాయో, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కంచరపాలెం పరిధిలో బైక్‌లు, సెల్‌ఫోన్ల దొంగతనాలు, ఇళ్లలో చోరీలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బైక్‌లు సురక్షిత ప్రదేశాల్లో పార్కు చేసి తాళాలు వేయాలన్నారు. అలాగే తాళం వేసి ఉన్న ఇళ్లలో కూడా చోరీలు జరుగుతున్నాయని తెలిపారు. సెల్‌ఫోన్‌కు అపరిచిత వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వచ్చినా ఆ లింకులు ఓపెన్ చేయకూడదని, వాటికి స్పందించకూడదని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, బంగారం, వెండి చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. యువత ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని, వాటి జోలికి పోకూడదని, అఘాయిత్యాలకు పాల్పడకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించకుండా హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలని సూచించారు.

మాతృభాష ఎంతో గొప్పది

సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ చిన్నమ్మాయి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ అమ్మ ఒడి నుంచి అందరూ ముందుగా నేర్చుకునే భాష మాతృభాష అని, మాతృభాష గొప్పతనాన్ని తెలియజేశారు. మనస్సులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషకే ఉంటుందన్నారు. అందువల్ల మహనీయులందరూ ముందుగా మాతృభాష నేర్చుకుని, దాని గొప్పతనాన్ని తెలియజేశారన్నారు. మాతృభాష పరిరక్షణకూ అందరూ కృషి చేయాలని కోరారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహ, కలశ ప్రతిష్ట


కాశీ విశ్వేశ్వరస్వామి కలశ ప్రతిష్ట నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లిలో గల కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ, యంత్ర పసిడి కలశ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కార్యక్రమం నిర్వహించారు. వేకువజాము నుండి గోపూజ, నవరత్నన్యాసము, పీఠ పూజ, కూష్మాండబలి పూజలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో భారీ అన్నసమారాధన జరిగింది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు దంపతులు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, యర్రంశెట్టి రాము, ఉప సర్పంచ్ సురేష్, నాయకులు సిరపరపు వాసు, యడ్ల నాయుడు, కరక రాము, గురి శ్రీనివాస్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్


విద్యార్థులకు కళ్లద్దాలు అందిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

పెందుర్తి : పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిష్, సైన్స్, హిందీ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రశ్నలు వేశారు. పరీక్షల్లో చూచిరాతకు పాల్పడరాదని సూచించారు. విద్యార్థి దశ నుంచే పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించి వారి నుంచి మంచిని గ్రహించాలన్నారు. జీవితంలో స్థిరపడాలంటే సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి జవాబులు రాబట్టారు. పరిశుభ్రతతోపాటు తరగతి గది, పాఠశాలలో నిర్దేశించిన నియమాలను పాటించి క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చదువుతున్న పాఠశాలకు పేరు తేవాలన్నారు. డీసీఈబీ మెటీరియల్ చదివితే పరీక్షల్లో కనీసం 80 శాతం మార్కులు సాధించవచ్చన్నారు. ప్రతీ విద్యార్థి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఇతర తరగతులను ఆయన పరిశీలించి విద్యా ప్రమాణాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు జారీ చేశారు. ఉపాధ్యాయులను సమావేశపరిచి పదోతరతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణతకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిపారు. ఇంతవరకు నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కులను పరిశీలించి, మూల్యాంకనం చేసిన పరీక్ష పేపర్లను స్వయంగా పరిశీలించారు. ఫిజిక్స్, బయాలజీ పేపర్లను పరిశీలించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కనీస అభ్యసన స్థాయిలు సాధించే విధంగా ప్రణాళిక అమలు చేయాలని ప్రధానోపాధ్యాయుడు కె.జయప్రసాద్‌ను ఆదేశించారు. హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీఫైనల్ – 2 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందజేసిన కళ్లద్దాలను విద్యార్థులకు ప్రేమ్ కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలేజీ సీనియర్ పీజీటీ కె.వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు, పీజీటీలు పాల్గొన్నారు.

9 కేజీల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 9 కేజీల గంజాయి సీజ్ చేశారు. విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లాకు చెందిన కె.సూర్యప్రకాష్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

దారి కాచి యువకుడిపై కత్తితో దాడి


గాయపడ్డ దుర్గా ప్రసాద్

పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో దారి దోపిడీ యత్నం జరిగింది. బలవంతంగా సెల్‌ఫోన్ అపహరించాలని ప్రయత్నించిన దుండగుడి చేతిలో ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులో గురువారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తిలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న దుర్గా ప్రసాద్ అనే యువకుడు గురువారం రాత్రి పని ముగించుకున్నాడు. అనంతరం సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులో నివసిస్తున్న వరసకు సోదరుడైన వ్యక్తి వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఫోన్ మాట్లాడేందుకు రోడ్డు పక్కన ఆగాడు. అదే సమయంలో ముఖానికి మాస్క్(స్కార్ఫ్) వేసుకుని వచ్చిన దుండగుడు దుర్గాప్రసాద్‌ను సెల్‌ఫోన్ ఇవ్వమని గదమాయించాడు. దీనికి దుర్గాప్రసాద్ నిరాకరించడంతో దుండగుడు తన జేబులో ఉన్న కత్తి (నైఫ్) తీసి విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో దుర్గాప్రసాద్ చేయి, ఛాతీపై గాయాలయ్యాయి. వెంటనే దుండగుడ్ని వెంబడించినా ఫలితం లేకపోయింది. దీంతో పెందుర్తి పోలీసులను బాధితుడు శుక్రవారం ఆశ్రయించాడు. దారి దోపిడీ, హత్యయత్నం కేసులు నమోదు చేసి సీఐ కె.వి.సతీస్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com